


# మాస్టర్ ప్లాన్

ఎన్నికల తేదీని ప్రకటించడంతో అన్ని పార్టీల కార్యాలయాల్లో సందడి అధికమైంది.

సీట్ల సర్దుబాట్లు ముగిసి, అభ్యర్థుల పేర్లు ఖరారు కావటంతో ఎన్నికల ప్రచారానికి ప్రారంభోత్సవమైనట్లైంది.

కానీ, అంబోధరపల్లి గ్రామస్థులకు మాత్రం అది విచారానికి దారి తీసింది.

ఆ మాటకొస్తే అనివార్యమైన ఎన్నికల పట్ల అందరికీ అసంతృప్తే! కానీ, ఇక్కడ అంబోధరపల్లి వాసులకు ఏర్పడిన 'వైరాగ్యం' ఎన్నికలపై ఎంతమాత్రమూ కాదు! ఎన్నికల ప్రచార పద్ధతులపై మాత్రమే!

అందులోనూ నిన్నగాక మొన్న వెళ్లిన కొత్త సంవత్సరాది నాడు ఇండ్లకు వెల్ల వేశారేమో - అప్పుడే దాన్ని ఖరాబు చేసేవాళ్లు బయలుదేరటంతో వారికి ఎక్కడలేని దిగులూ ముంచుకొచ్చింది.

ఎలాగైనా దాన్ని వాళ్లు అరికట్టా లనుకున్నారు.

ఆ రోజే ఊళ్లో అందరూ సమావేశ మయ్యారు. అంతా కలిసి ఒక 'మాస్టర్ ప్లాన్' వేశారు. అప్పటి కప్పుడు దాన్ని వెంటనే అమలు పరచారు కూడా!

వెల్ల వేసిన గోడలపై రాయడానికి వెళ్లిన వాళ్లు - గోడ క్కొట్టిన బంతిలా తిరిగొచ్చి తెల్లమొహం వేసుకొని నిలబడ్డంతో చిర్రెత్తుకొచ్చింది చిదంబరానికి!

అతడు 'పాదం' గుర్తు గల పార్టీ అభ్యర్థి!

ప్రతి ఎన్నికల్లోనూ అతడు వరుసగా ఓడిపోతూ ఉండటంతో ఈసారి టిక్కెట్ ఇవ్వడమే సందేహం అనుకున్నా రంతా!

కానీ 'పరదేశి స్వామి' రికమెండేషన్‌తో ఎలాగో టిక్కెట్ సంపాదించాడు.

ఈసారైనా ఎలాగో గెలిచి తీరాలనే గట్టి ప్రయత్నం మీద ఉన్నా డతడు!

అలాంటిది ఆదిలోనే హంసపాదు అన్నట్లు - వెళ్లిన వాళ్లు పని ముగించుకొని రాక, ఇలా మొహం వేలాడేసి నిలబడ్డంతో చిటపట లాడిపోయాడు చిదంబరం.

అసలు విషయం తెలుసుకున్నాక - "ఔరా! అంబోధరపల్లి ఓటర్లు ఎంత తెలివిమీరిపోయారు?!" అంటూ ముక్కుమీద వేలేసుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో పరాంకుశం - తన ఫోటోతో ప్రింటైన పోస్టర్ల కట్టతో అంబోధరపల్లిలోకి ప్రవేశించాడు.

పరాంకుశం 'బండి' గుర్తు గల పార్టీ అభ్యర్థి.

ఇన్నేళ్ల అతడి నిరంతర, నిర్విరామ, నిస్వార్థ సేవను[?] గుర్తించి ఈసారి టిక్కెట్ ఇచ్చా రతడికి!

వచ్చిన 'అవకాశాన్ని' వదులుకోకూడదనీ, ఎలాగైనా గెలిచి తీరాలనీ తీవ్రంగా కృషి చేస్తున్నాడు.

అందులో భాగంగా - పోస్టర్లు అతికించే కార్యక్రమంలో కూడా స్వయంగా తనే భాగం పంచుకోసాగాడు.

అంతవరకూ చకచకా కొనసాగిన పని అంబోధరపల్లిలో మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు!

అందుకు కారణం - అక్కడి గోడలపై సాక్షాత్కరించిన ఇంటి యజమానుల విలక్షణమైన హెచ్చరికలు!

ఏమిటంటే-

'ఈ ఇంటి గోడలపై ఏ పార్టీ అయినా ఎన్నికల నోటీసులు అతికించినా, రాసినా ఆ పార్టీకి మా ఇంటి ఓట్లు పడవు' అని.

ఈ హెచ్చరిక ఆ రెండు పార్టీల అభ్యర్థుల్లో గుబులు రేకెత్తించింది. ఒక్క ఓటు తేడాతో కూడా ఓడిపోయే ప్రమాదం ఉండటంతో ఎవరూ అంబోధరపల్లి గోడల జోలికి పోలేదు!

రోజూ ఉదయం తమ తమ ఇంటి గోడల్ని చూసుకొని ముసి ముసిగా నవ్వుకోసాగారు గ్రామస్థులు.

ఎన్నికల తేదీ దగ్గర పడటంతో వేరే పద్ధతుల ద్వారా అంబోధరపల్లిలో ప్రచారాన్ని ముమ్మరం చేశాడు చిదంబరం.

డబ్బును నీళ్లలాగా ఖర్చు చేస్తూ ఓటర్లను ఆకర్షించసాగాడు. ఎక్కడ చూసినా తమ పార్టీ గురించే టాక్ వస్తూ ఉండటంతో - పరాంకుశానికి పరాజయం తప్పదని చిదంబరం ధీమాగా ఉన్నాడు.

పరాంకుశం ఆలోచనలో పడ్డాడు!

చివరికి ప్రచారం హోరు ముగిసింది. ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల రోజు-

ఉదయాన్నే తలుపులు తీసుకొని బయటకు వచ్చిన అంబోధరపల్లి గ్రామస్థులు తమ ఇంటి గోడలను చూసి అవాక్కులయి, పళ్లు పటపట కొరికారు.

కోపంతో బూతులు తిట్టుకుంటూ బూతుల దగ్గరకు వెళ్లారు.

బ్యాలట్ పత్రం అందుకొని తమ కసికొద్దీ పరాంకుశం [గుర్తు]పై ముద్రలు వేసేశారు!

మరుసటి రోజు ఫలితాలు ప్రకటించారు.

పరాంకుశం పూర్తి మెజారిటీతో గెలిచాడు.

పాపం! చిదంబరం మళ్లీ ఓడిపోయాడు!

చిదంబరానికి తన పేరుతో నినాదాలు గోడల మీద రాయించిందెవరో తెలిసినా ఏం చేయగలడు?

జి. బాలాజీ